క్లుప్తంగా

అడవులను పరిరక్షించాలి..



బూర్గుడెంలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: అడవుల పరిరక్షణ బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిదని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ అన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని బూర్గుడెం ఫారెస్టులో నిర్మించిన ప్లాంటేషన్‌ను, చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీప్రాంతంలోని దివంగత రేంజర్ శ్రీనివాసరావు స్మృతివనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు పేరిట అడవులను నరికితే సహించబోమన్నారు. వన్యప్రాణుల వేటపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బడికి పంపించండి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): పిల్లలను బడికి పంపించాలని ఆదివాసీ గొత్తికోయలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ కోరారు. మండలంలోని మహెబూబ్‌నగర్ శివారు 3 కిలోమీటర్ల అటవీప్రాంతంలో ఉన్న రజబ్‌అలీనగర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. గొత్తికోయగూడెం నుంచి 11 మంది విద్యార్థులు మహెబూబ్‌నగర్‌లోని పాఠశాలకు హాజరవుతున్నారని, వీరిని ప్రతిరోజు పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, బుచ్చయ్యలు తీసుకువచ్చి, సాయంత్రం తిరిగి ఇంటికి చేర్చుతున్నారని వెల్లడించారు. జిల్లా అధికారులతో మాట్లాడి విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. సెంటర్ ఫర్ ఫౌండేషన్ టీం, సమగ్రశిక్ష జిల్లా టెక్నికల్ టీం సభ్యులు కార్తీక్ పాల్గొన్నారు.

'పెదవాగు'ను గాలికొదిలేశారు..

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల 'పెదవాగు ప్రాజెక్టు'కు గండ్లు పడి ఏడాది కాగా.. నేటికి ప్రాజెక్టు పున:నిర్మాణాన్ని గాలికి వదిలేశారని స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం, నందిపాడు, గుమ్మడవల్లి, కుడుములపాడు, ఆసుపాక గ్రామాల్లో పర్యటించారు. ముందుగా ఆయా గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన గుమ్మడవల్లి రైతులతో మాటాడుతూ.. పెదవాగు ప్రాజెక్టు, పంటల సాగుపై ఆరా తీశారు. బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, సంకా ప్రసాద్, మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్, ఎండి ఆసీఫ్, లక్ష్మీనర్సయ్య, రమణయ్య పాల్గొన్నారు.

రోడ్లను బాగుచేయాలి

దుమ్ముగూడెం: గ్రామాల్లో ఉన్న అంతర్గత రహదారులను బాగు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జెడ్‌వీ పురం, కొమరం వారి గుంపు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడ్ వీరభద్రారం, కొమరం వారి గుంపు గ్రామాల మధ్యనున్న రోడ్డు తక్షణం బాగు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు సుమారుగా 90 ఇళ్లున్న గ్రామంలో 15 ఇళ్లకు మాత్రమే నీరు వస్తుందని మిగతా వాటికి తక్షణమే మిషన్ భగీరథ నీరు అందే ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాల్లో ఇతర సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో నాయకులు కొమరం చంటి, సోయం వెంకటేశ్వరావు, కొమరం పెంటయ్యా, కొమరం చిట్టిబాబు, శ్రీను, నవీన్, పవన్ కుమార్, లక్ష్మీనరసు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

5న ధర్నా

గుండాల: ఉపాధ్యాయుల హక్కులసాధన కోసం ఆగస్టు 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగరాంబాబు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్సీ ప్రకటించి అమలు చేయడం, పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించడం తదితర విద్యారంగ సమస్యలపై ధర్నా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని సూరారం గ్రామ శివారులో భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కే రేగుబల్లి గ్రామానికి చెందిన కొర్సా రామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. రామకృష్ణ పల్సర్ ద్విచక్ర వాహనంపై గంగోలు వైపు నుంచి రేగుబల్లి వెళ్లుతుండగా భద్రాచలం నుండి చర్ల వైపు వస్తున్న ఆల్టో కారు ఎదురుఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు భద్రాచలం వైద్యశాలకు 108లో తరలించారు. రామకృష్ణకు కాలు, చేతుల దగ్గర విరిగి తీవ్ర రక్తస్రావం అయ్యి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు వేదికలు

- కాలనీల్లో అడవిని తలపిస్తున్న నివాస ఖాళీ స్థలాలు
- దోమలు, ఇతర హానికర కీటకాలు ఆవాసం
- నిర్వహణ పట్టించుకోని స్థల యజమానులు, అధికారులు



పాత మార్కెట్ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్థలంలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు



మెడికల్ కాలనీలోని ఓ ఖాళీ ఇంటి స్థలంలో పెరిగిన చెట్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయి దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. భద్రాచలం నడిబొడ్డున ఉన్న సూపర్ బజార్, పాత మార్కెట్ రోడ్డు, మెడికల్ కాలనీ, శాంతినగర్, కంభాలపాడు కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో కొందరు ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగి పోయి వర్షపునీరు, మురుగునీరు చేరి దోమలు, ఇతర హానికర కీటకాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు విషజ్వరాల బారిన పడుతున్నారు.

పట్టింపు లేదు..

స్థలాల యజమానులు అధిక ధరలు వస్తే లాభానికి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. అంత వరకు స్థలాలను ఖాళీగా వదిలేస్తున్నారు. పిచ్చిమొక్కలు తొలగించాలని చుట్టుపక్కల వారు చెప్పినా.. కనీసం పట్టించుకోవడం లేదని ఇరుగుపొరుగు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లడంతోపాటు సాయంత్రం దోమల బెడద ఎక్కువవుతోంది. ఇప్పటికైనా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను గుర్తించి మట్టి వేసి ఎత్తుచేయించడం, పిచ్చిమొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించడం వంటి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతోంది..



ఇంటి ఎదురుగా ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వర్షపు నీరు చేరుతోంది. దోమల నిలయంగా మారింది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. పశువులు, దోమలు స్వైర విహారం చేయడంతో అనారోగ్యాల పాలవుతున్నాం. అధికారులు దీనిపై విచారణ చేసి సమస్య పరిష్కరించాలి.

– వీవీ ప్రసాద్, భద్రాచలం

పాముల బెడద..



మా ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయి అడవిలా కనిపిస్తోంది. సాయంత్రం పెద్ద పెద్ద పాములు ఇంటి చుట్టూ తిరుగుతున్నాయి. స్థల యజమానులకు సమాచారం అందించి శుభ్రం చేయాలని కోరినా.. పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు చేపట్టి రక్షణ కల్పించాలి.

– విజయలక్ష్మి, కంభాలపాడు, భద్రాచలం

చర్యలు చేపడుతాం..



ఖాళీ స్థలాల యజమానులను ఇప్పటికే పలుమార్లు హెచ్చరించాం. నోటీసులు జారీచేశాం. స్థలాలను ఎత్తుచేయాలని, పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. మరోసారి స్థల యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తాం.

– శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ, భద్రాచలం

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



అన్నపురెడ్డిపల్లి: మండల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం జిల్లా హౌసింగ్ పీడీ ఎంవీ రవీంద్రనాథ్ పరిశీలించారు. లబ్ధిదారులతో ఆయన నేరుగా మాట్లాడారు. తొలివిడత బిల్లులు వచ్చాయా అని ఆరా తీశారు. నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బయ్యారపు అశోక్, హౌజింగ్ ఏఈ రాము పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో జిల్లా హౌజింగ్ పీడీ రవీంద్రనాథ్ సమావేశమయ్యారు. ఎల్‌టీ జాబితాలోని ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ఇందిర ఆవాస్ సమోదు ప్రక్రియ, ఇంటి నిర్మాణ మార్కింగ్‌పై గ్రామపంచాయతీ సెక్రటరీలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరానికిగాను ఆగస్టు 6వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్‌లకు అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంపీసీ, బీజెడ్‌సీ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఏ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

రామచంద్రరావుకు స్వాగతం

బూర్గంపాడు: భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో స్థానిక బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, బిజ్జం అశోక్‌రెడ్డి, బాలునాయక్, కేసగాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్

మణుగూరుటౌన్: మండల పరిధిలోని ఎస్టీ కాలనీ, విప్పలగుంపులో ప్రాథమిక ఆధ్వర్యంలో బుధవారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వినియోగించకుండా నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వేడినీరు సేవించాలని అవగాహన కల్పించారు. అనంతరం హెల్త్‌క్యాంప్ నిర్వహించి జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించి వివిధ రకాల రోగాలకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ వీరాస్వామి, రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మణిధర్

అశ్వాపురం: వరదలు, విపత్తులు, అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మణిధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తహసీల్దార్ అధ్యక్షతన బుధవారం జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీబ్‌దరిపా సదస్సులో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మణిధర్ మాట్లాడుతూ.. వరదలు, విపత్తులు, అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు వరదల సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శేషుబాబు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది జగదీష్, తిరుపతిరావు, అరవింద్, దుబే, చిన్ని, రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు స్త్రీ వైద్య నిపుణులు స్పందన ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యం–పరిరక్షణ అనే అంశంపై పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య పాల్గొని మాట్లాడారు. చదువుకు విద్యార్థినులకు తరుచు వచ్చే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలిపారు. అనంతరం పాఠశాలకు డాక్టర్ స్పందన 10 సీలింగ ఫ్యాన్లను వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యారాలు టి.రమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై 'పెసా' సభలు



గుండాల: మద్యం షాపు ఏర్పాటుకు చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న ప్రజలు

గుండాలలో మద్యం షాపునకు ఆమోదం..

గుండాల: మండల కేంద్రంలో మద్యం షాపుకు పెసా గ్రామసభలో స్థానికులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మద్యం షాపు కావాలా.. వద్దా.. అనే అంశంపై గ్రామసభ నిర్వహించారు. మద్యం షాప్ పరిధిలో బెల్ట్ షాపులను రద్దు చేయాలని, షాపులో అన్ని రకాల మద్యం అమ్మాలని, ఎంఆర్‌పీ రేటు ప్రకారం విక్రయించాలని అభిప్రాయాలు వ్యక్తపరిచారు. అనంతరం మద్యం షాపు కావాలని కొంతమంది, వద్దని మరి కొంతమంది చేతులెత్తారు. ఎక్కువ శాతం మద్యం కావాలని ఆమోదం తెలపడంతో తీర్మాణం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శి శ్యాంసుందర్, పెసా కమిటీ సభ్యులు గోవింద నరసింహ రావు, నాగరాజు అనిల్ పాల్గొన్నారు.

కోరం లేక సభ వాయిదా..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పెసా గ్రామసభ వాయిదా పడింది. మద్యం షాపుల నిర్వహణ కోసం నిర్వహించిన సభలో కోరంకు సరిపడా జనం హాజరు కాలేదు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సభలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంపీఓ ఖాన్, సెక్రటరీ రవీందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

మండలంలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన పెసా గ్రామసభ వాయిదా పడింది. మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సభలో కోరంకు సరిపడ ప్రజలు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మహాలక్ష్మి వెల్లడించారు.

ఆగస్టు 2న సభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఏ-4 మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించి వచ్చే నెల 2న ఉదయం 11 గంటలకు భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహించనున్నట్లుగా బుధవారం భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాగా ఈ కార్యక్రమాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లుగా ఆయన తెలిపారు.

25 శాతం నిధులు కేటాయించాలి

భద్రాచలంటౌన్: విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి.. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర నాయకుడు బి.రాజు కోరారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు చేపట్టిన ధర్నాను విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాన్ని టీఎస్ యుటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కరంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామాచారి, ఎస్.విజయ కుమార్, కె.శ్రీనివాసరావు, బి.ప్రకాష్ రావు, కె.వెంకటేశ్వర్లు, రామచంద్, కె.సైదులు ఆర్. భాష్య, బి.రఘునందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి పెట్టాలి



ఇందిరమ్మ ఇంటి హక్కు పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మామిళ్లవారిగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేటలోని రైతు వేదికలో స్వయం సహాయక సంఘం మహిళలచేత తయారు చేసిన ఉత్పత్తుల మేళా కార్యక్రమాన్ని సందర్శించారు. ఆ తర్వాత స్థానిక క్యాంప్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల హక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు స్వయం ఉపాధి కోసం కోట్లాది రూపాయాల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, వేముల భారతి, సత్యనారాయణ, మిండా హరి, దివాకర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ లక్ష్మణ్‌రావు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామంలో ఉన్న రైతువేదికలో మణుగూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గుట్టమల్లారం గ్రామాన్ని ప్రకృతి వ్యవసాయం క్లస్టర్‌గా ఏర్పాటు చేయడమే కాకుండా 125 మంది రైతులను ఎంపిక చేశామన్నారు. వీరితో 50 హెక్టార్లలో సేంద్రీయ పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ద్రవ, ఘన జీవామృతాలు, నిమాస్త్రం తదితర జీవన ఎరువుల తయారీ, పంటల్లో వాటి వాడకంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు రసాయన వ్యవసాయాన్ని వీడి ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ కారం ముత్తయ్య, కణితి పాపారావు, కొమరం మధుకిరణ్, కారం రమేష్, కారం మల్లేష్, మహిళా రైతులు బుచ్చమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు



చర్ల బస్టాండ్‌లో అనుమానిత వ్యక్తులను తనిఖీ చేస్తున్న పోలీసులు

చర్ల: మండలంతో పాటు శివారు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు బుధవారం తనిఖీలను చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లతో పాటు శివారు ఆదివాసీ గ్రామాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదార్లలో తనిఖీలను నిర్వహిస్తున్నారు. చర్ల సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో తనిఖీలను చేపడుతున్నారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు వారి వెంట తీసుకెళ్తున్న లగేజీలను నిశితంగా పరిశీలించి నిర్ధారించుకున్న తరువాతనే విడిచిపెడుతున్నారు. ప్రత్యేక బలగాలతో ఆకస్మికంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎక్కడ అనుమానం వస్తే అక్కడ ఆయా వాహనాలను, వ్యక్తులను ఆపి తనిఖీ చేస్తున్నారు.

పినపాక: వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ సరైన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఈ బయ్యారం ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్‌లో మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. వాహనదారులు అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్య భూములపై బీజేపీ మొసలి కన్నీరు..



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: రామయ్య భూములపై తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు మొసలి కన్నీరు కార్చితే ఇక్కడ ప్రజలు నమ్మరని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కరకట్ట రక్షణ, పోలవరం ముంపు అధ్యయన యాత్ర చేపట్టారు. ముంపు కాలనీలో పర్యటించి లోతట్టు ప్రాంత ప్రజలతో వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కరకట్ట రక్షణ గోడ కూలి నెల రోజులవుతున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి వచ్చే ముంపుపై అఖిలపక్షాన్ని కలుపుకుని కార్యచరణ రూపొందించాలని హితవు పలికారు. సుభాష్ నగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కరకట్ట పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. అధ్యయన యాత్రంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించగా.. రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎర్రంశెట్టి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

దమ్మపేట: విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి యేసు అను వ్యక్తి, తన ఐదు గేదెలను మేత కోసం అల్లిపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రానికి తోలుకెళ్లాడు. ఆ క్షేత్రంలో 11 కేవీ లైనుకు సంబంధించిన విద్యుత్ తీగ తెగి, మేత మేస్తున్న గేదెల మీద పడింది. దీనితో ఐదు గేదెలు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.4 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.